1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

సంపుటి : 3 సంచిక : 22 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 23 జనవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 22 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 23 January 2026 PAGES : 8 PRICE : 3/-


## ప్రపంచం నెత్తిన ట్రంప్ కుంపటి




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 22)

డొనాల్డ్ జాన్ ట్రంప్.. నోరు తెరిస్తే అగ్గిరాజుకుంటుంది. ఆయన నిర్ణయం పెను వివాదాలు రేపుతుంది.. ఆయన పావులు కదిపితే ప్రపంచం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అంతా తానే.. సర్వస్వం అమెరికాయే అనే ధృడమైన విశ్వాసి. ఓ వైపు శాంతి మంత్రం జపిస్తుంటారు.. మరోవైపు దేశాలపై యుద్ధాలకు కాలు దువ్వుతుంటారు. ఆయన మాటలు ప్రత్యర్థులనే కాదు.. మిత్రులనూ కలవరపాటుకు గురి చేస్తుంటాయి. రెండోసారి అమెరికా అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచే ఆయన ఈ ప్రపంచంపై సవాళ్లు విసరడం ప్రారంభించారు. వాణిజ్య యుద్ధాలు ప్రారంభించి.. అనేక దేశాలను ఉక్కిరిబిక్కిరి చేశారు. స్వదేశంలో వలసదారులపై యుద్ధాన్ని ప్రారంభించి.. వేలమంది గుండెల్లో గుబులు రేపారు. రెండోసారి అధికారాన్ని చేపట్టి ఏడాది పాలనను పూర్తిచేసుకున్న డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలెన్నో అత్యంత వివాదాస్పదంగా మారాయి. ఆధునిక రాజకీయాల్లో అత్యంత వివాదాస్పద నేతగా ఉన్న ట్రంప్.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని ఆ స్థాయిలో వణికిస్తున్నారు.

**నాడు పనామా.. నేడు గ్రీన్‌లాండ్..**

గత ఏడాది అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా 'మా దారికి ఏదీ అడ్డురాదు' అని ట్రంప్ ప్రకటించారు. ఆ సమయంలో ఆయన దృష్టిలో ఒక్క పనామా కాలువే ఉంది. దానిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు అదే విధానాన్ని గ్రీన్‌లాండ్‌పై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. 'మనం దానిని పొందాలి' అనే కొత్త మంత్రాన్ని ఆయన జపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో -మిగతా 2లో

## ఓట్ల కోసమే మోదీ 'చాయ్‌వాలా' కబుర్లు: ఖర్గే



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 22)

ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. తనకు తాను చాయ్‌వాలా అని మోదీ ప్రకటించుకుంటారని.. కానీ ఎప్పుడైనా ఆయన చాయ్ పెట్టారా అని ప్రశ్నించారు. ఓట్ల కోసమే ఆయన ఇటువంటి ప్రచారాలు చేసుకుంటారని దుయ్యబట్టారు. దిల్లీలో నిర్వహించిన ఉపాధి హామీ కార్మికుల -మిగతా 2లో

## 'చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్'.. స్టడీ చేస్తున్నాం: మంత్రి నారా లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 22)

ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించింది. ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. దావోస్?లో బ్లూమ్‌బర్గ్‌తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. "ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు -మిగతా 2లో

# దావోస్ పర్యటన ఫలప్రదం...


# బ్రాండ్ ఏపీకి ప్రపంచ ఖ్యాతి

**దావోస్ పర్యటనతో ఏపీ బ్రాండింగ్ పెరిగిందన్న చంద్రబాబు**

**పలువురు గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో సమావేశం**

**భారత్‌లో పెట్టుబడులపై పెరిగిన ఆసక్తి అని వెల్లడి**

**రాష్ట్రంలో కీలక ప్రాజెక్టుల పురోగతిపై చర్చలు**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 22)

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తన పర్యటన విజయవంతమైందని, ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ బ్రాండింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటనను ముగించుకుని గురువారం ఆయన ఈ విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ పారిశ్రామిక రంగంలోని ధోరణులను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాల దృక్పథాలను అర్థం చేసుకోవడానికి ప్రపంచ ఆర్థిక వేదిక ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.గత మూడు రోజులుగా జరిగిన వివిధ సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, పర్యాటకం వంటి కీలక రంగాల్లో రాష్ట్రం సాధించిన విజయాలను, ప్రగతిని సమర్థవంతంగా ప్రపంచానికి తెలియజేశామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రపంచ కార్పొరేట్ దిగ్గజాలు భారత్‌పై అధిక ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో ఉన్న యువశక్తి, సమర్థవంతమైన నాయకత్వం, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాల కారణంగా అన్ని రంగాల్లోనూ కంపెనీల స్థాపనకు అవకాశాలు -మిగతా 2లో

## ఐదేళ్లు మొద్దు నిద్రలో ఉన్న జగన్.. కొత్త డ్రామాకు తెరతీశారు నిమ్మల రామానాయుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 22)

రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టబోతున్నట్టు వైసీపీ అధినేత జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ... విమర్శలు గుప్పించారు. ఏపీలో వైసీపీ శకం పూర్తిగా ముగిసిందని అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాతే జగన్‌కు పాదయాత్ర గుర్తొచ్చిందంటూ ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాటు మొద్దు నిద్రలో ఉన్న జగన్ ఇప్పుడు పాదయాత్ర పేరుతో మరోసారి డ్రామాకు తెరతీశారని విమర్శించారు.పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం ఏనుగువానిలంక గ్రామంలో నిమ్మల పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 10.92 కోట్ల వ్యయంతో కాజ మేజర్ డ్రైన్‌పై అవుట్‌ఫాల్స్ స్లూయిస్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే యలమంచిలి నుంచి బాడవ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.గత ఐదేళ్లలో గోదావరి వరదల కారణంగా వేలాది ఎకరాల పంటలు నష్టపోయాయని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో అధికారులు వచ్చి వెళ్లారే తప్ప, కాజ మేజర్ డ్రైన్ అవుట్‌ఫాల్స్ స్లూయిస్ పనులకు మాత్రం మోక్షం కలగలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాకే ఈ పనులకు శంకుస్థాపన జరిగిందని స్పష్టం చేశారు.రైతుల కష్టాలు తెలుసుకుని పనిచేసే ప్రభుత్వం తమదేనని నిమ్మల రామానాయుడు తెలిపారు. సాగునీటి సమస్యలు, ముంపు బాధలను శాశ్వతంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జగన్ పాదయాత్రలకే పరిమితమైతే, తాము పనులతో ప్రజలకు జవాబు ఇస్తామని నిమ్మల స్పష్టం చేశారు.

# ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా: జగన్ స్పష్టీకరణ

**ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి హాజరవుతానని స్పష్టం చేసిన జగన్**

**భూముల సమగ్ర రీసర్వేలో చంద్రబాబుది 'క్రెడిట్ చోరీ' అని తీవ్ర ఆరోపణ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 22)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురువారం కీలక ప్రకటన చేశారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తే తప్ప అసెంబ్లీలో అడుగుపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలను, తప్పుడు పనులను సభలో ఎండగట్టాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, అప్పుడే తనకు తగినంత సమయం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడానికి స్పీకర్?కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. "అసెంబ్లీలో ఉన్నది ఒక్కటే ప్రతిపక్షం, అది వైసీపీ మాత్రమే. మిగతా పార్టీలన్నీ ప్రభుత్వంలో భాగస్వాములే. మరి మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్ ఎందుకు అడ్డుకుంటున్నారుఇది ప్రజాస్వామ్యమా అని మీరు స్పీకర్‌ను ప్రశ్నించాలి" అని జగన్ అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు "పని చేయకపోతే జీతం లేదు" (నో వర్క్, నో పే) విధానం అమలు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిన్న లక్నోలో జరిగిన సదస్సులో సూచించిన నేపథ్యంలో జగన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు 2024 నుంచి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే.

**భూ సర్వేలో చంద్రబాబుది 'క్రెడిట్ చోరీ'**

భూముల సమగ్ర రీసర్వే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతున్నారని జగన్ తీవ్రంగా ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన 'భూ రక్ష', 'భూ హక్కు' పథకాలను చంద్రబాబు హైజాక్ చేశారని, ఈ బృహత్కార్యంలో ఆయన పాత్ర ఏమాత్రం లేకపోయినా ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తన పాదయాత్ర సందర్భంగా రైతులు భూ వివాదాలు, టైటిల్స్ సమస్యలపై తన వద్ద గోడు వెళ్లబోసుకున్నారని, అందుకే 2019 మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చామని గుర్తుచేశారు. తమ హయాంలో రూ.6,000 కోట్లు ఖర్చు చేసి, దాదాపు 40,000 మంది సిబ్బందిని నియమించి అత్యాధునిక టెక్నాలజీతో సమగ్ర భూ సంస్కరణలు చేపట్టామని, ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని తెలిపారు.

కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక, రైతులకు గతంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను వెనక్కి తీసుకుని, వాటి రంగు మార్చి మళ్లీ ఇస్తూ మొత్తం ఘనత తనదేనని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కొత్త పాస్?బుక్?లలో తప్పులు ఎక్కువగా ఉండటంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయన్నారు. అంతేకాకుండా, ఈ పథకం అమలును ప్రశంసిస్తూ కేంద్రం ఇచ్చిన రూ.400 కోట్ల నిధులను కూడా టీడీపీ నాయకత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించడం సంచలనం రేపింది. -మిగతా 2లో

## జగన్.. రాష్ట్రాన్ని చోరీ చేసి.. క్రెడిట్ చోరీ గురించి మాట్లాడతారా మంత్రి గొట్టిపాటి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 22)

క్యారెక్టర్ లేని మాజీ సీఎం జగన్ క్రెడిట్ గురించి మాట్లాడటం విడ్డూరమని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏం చేశారని ఆయనకు క్రెడిట్? ఇవ్వాలని మండిపడ్డారు.

"వైకాపా హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. విద్యుత్‌శాఖను జగన్ సర్వనాశనం చేశారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.30వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారు. పీపీఏలు రద్దు చేశారు. వీటన్నింటి క్రెడిట్ కచ్చితంగా జగన్‌కు ఇవ్వాలి. మళ్లీ ఏం మొహం పెట్టుకుని ఆయన మాట్లాడుతున్నారు. వైకాపా అధికారంలో ఉండుంటే రాష్ట్రం అప్పులకుప్పగా మారడంతో పాటు విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యేది. రాష్ట్రాన్ని చోరీ చేసిన జగన్.. క్రెడిట్ చోరీ గురించి మాట్లాడుతుంటే జనం నవ్వుకుంటున్నారు" అని గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

# వెలుగు కార్యాలయంలో ఈనారి - సిఆర్పిల శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 22)

మార్కాపురం మండలంలోని ఎస్సీ బీసీ కాలనీలో గల వెలుగు కార్యాలయం నందు ఏపిఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఈనారి సిఆర్పిల శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దర్శనం దానం పాల్గొని మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యుల యొక్క ప్రతినెల జరగవలసిన సమావేశాలు, గ్రామ సంఘ సమావేశాలు ప్రతి నెలా సక్రమంగా నిర్వహించుకుని ప్రతి సంఘ సభ్యురాలికి మన డబ్బులు, మన లెక్కలు అనే కార్యక్రమంలో భాగంగా ప్రతి సభ్యురాలు యొక్క వ్యక్తిగత వివరాలు సభ్యురాలు యొక్క పొదుపులు సభ్యురాలు పొందిన వివిధ రకాల అప్పుల వివరాలు ఇప్పటివరకు సభ్యురాలు చెల్లించిన రుణ చెల్లింపుల వివరాలు సమావేశంలో చర్చించి సంఘ తీర్మాలలో పొందుపరచాలన్నారు. ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన యాప్ ద్వారా ఈ డేటాను ప్రతి నెల పూర్తి చేయవలసిన బాధ్యత ఈనారి సిఆర్పిలదని వాస్తవమైన వివరాలను పొందుపరచాలన్నారు. అదే విధంగా రుణాలు పొందిన ప్రతి సభ్యురాలు జీవనోపాదుల కొరకు ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వారికి అన్ని విధాలా సహకారాన్ని అందించి సంఘాల అభివృద్ధి, సంఘ సభ్యుల యొక్క ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గ్రామ సంఘ వివో ఏలు, సిఆర్పిలు జీవనోపాదుల వారు ఈనారిలు చక్కగా పనిచేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మండల వెలుగు ఏపిఎం పిచ్చయ్య, సీసీలు రామగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగయ్య, వివోఏలు ఈ నారి సిఆర్పిలు పాల్గొన్నారు.

# నేడు మెగా రక్తదాన శిబిరం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 22)

టిడిపి యువ నేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు కనిగిరిలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా స్థానిక అమరావతి గ్రౌండ్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి భారీ రక్తదాన శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి యువత పెద్ద సంఖ్యలో వచ్చి రక్తదానం చేసేందుకు సిద్ధమైనట్లు టిడిపి శ్రేణులు తెలిపాయి. కనిగిరి నియోజకవర్గంలో మునుపెన్నడూ జరగని విధంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, పువ్వాడి నాగరాజు, చెంచిరెడ్డి, షరీఫ్, తదితరులు తెలిపారు.

# రాజోలుపాడు గ్రామంలో మహిళ భద్రత పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 22)

మండలంలోని రాజోలపాడు గ్రామంలో గురువారం ఎస్సై సత్యనారాయణ మహిళలు,మైనర్ బాలికలపై జరుగు నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు ఉమెన్స్ సేఫ్టీ షీ టీమ్స్ పని తీరు పై గ్రామంలోని ప్రజలకు వివరించారు. తాత్కాలిక ఆనందాల కోసం ప్రలోభాలకు ఆకర్షణలకు గురై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిపోవడంతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మొదటి పేజీ తరువాయి


# దావోస్ పర్యటన ఫలప్రదం... బ్రాండ్ ఏపీకి ప్రపంచ ఖ్యాతి

గణనీయంగా పెరిగాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ సానుకూల వాతావరణాన్ని అందిపుచ్చుకుని ఆంధ్రప్రదేశ్?కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తన పర్యటన సాగిందని ఆయన స్పష్టం చేశారు.ఈ పర్యటనలో భాగంగా విశాఖపట్నంలోని టీసీఎస్ డెవలప్?మెంట్ సెంటర్ పురోగతి, అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ, కర్నూలులో ప్రతిపాదించిన సౌర విద్యుత్ ప్రాజెక్టులపై ఫలవంతమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సాంకేతిక, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.నాలుగు రోజుల దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత చురుకుగా పాల్గొన్నారు. ఆయన మొత్తం 36కు పైగా సమావేశాల్లో పాల్గొన్నారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో మూడు కీలక సమావేశాలు నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక వేదిక ప్రాంగణంలో 16 మంది ప్రపంచ స్థాయి పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశమయ్యారు. అలాగే, తొమ్మిదికి పైగా సెషన్లు, ఇతర సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడంలో దోహదపడతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింతగా ప్రచారం చేసేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ విధానాల ప్రభావాన్ని అంచనా వేయడంలో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు కీలకపాత్ర పోషించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా, యూరప్‌లో నివసిస్తున్న తెలుగు ప్రవాసులతో ప్రత్యేకంగా సమావేశమై వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు. దావోస్ సదస్సు వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రపంచానికి వివరించారు. మొత్తం మీద, ఈ పర్యటన రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేయడమే కాకుండా, భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**క్యాప్ జెమిని సీఈఓతో నారా లోకేశ్ భేటీ**

క్యాప్ జెమిని సీఈవో ఐమన్ ఎజ్జట్?తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దావోస్?లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖపట్నంలో ఇంటిగ్రేటెడ్ ఐటీ డెవలప్ మెంట్ సెంటర్, జీసీసీ, వర్టికల్ బీపీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ యూనివర్సిటీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో కలిసి పనిచేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు.ఈ ప్రతిపాదనపై. క్యాప్ జెమిని సీఈవో సానుకూలంగా స్పందించారు. భారత్ లో ఏఐ, క్లౌడ్-రెడీ వర్క్?ఫోర్స్? కోసం 45 వేల మంది ఉద్యోగుల నియామక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఇది త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ప్రపంచం నెత్తిన ట్రంప్ కుంపటి

కెనడాను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి వివాదానికి తెరలేపారు. అది తమ 51వ రాష్ట్రమంటూ పలుమార్లు ప్రకటించారు. డ్రగ్స్‌సరఫరా చేస్తున్నాయన్న పేరుతో మెక్సికో, కొలంబియాలపైనా కన్నేశారు. వాటిపైనా దాడులకు దిగుతామని హెచ్చరించారు.

**నాటో భవితవ్యానికి పరీక్ష**

అమెరికా కమాండర్ ఇన్-చీఫ్‌గా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి సర్వశక్తులొడ్డుతున్నారు. ఇందుకోసం ఐరోపా దేశాలతో కయ్యానికి సిద్ధపడుతున్నారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమను వ్యతిరేకించే దేశాలపై సుంకాలు వేస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ చర్యలతో 76 ఏళ్ల నాటో భవితవ్యం ప్రమాదంలో పడుతోంది. గత శతాబ్ద కాలంలో ఏ అమెరికా అధ్యక్షుడూ.. మిత్ర దేశాన్ని కబళించాలని చూడలేదు. అంతేకాకుండా ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదు. ఇప్పుడు గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ అదే చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏ అమెరికా నేతా.. రాజకీయ సిద్ధాంతాలను పక్కనబెట్టి ఇలా వ్యవహరించలేదు.

# ఓట్ల కోసమే మోదీ 'చాయ్‌వాలా' కబుర్లు: ఖర్గే

సదస్సులో పాల్గొన్న ఖర్గే.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు."ఓట్ల కోసమే ఆయన (ప్రధానిని ఉద్దేశిస్తూ) చాయ్‌వాలా అని ప్రకటించుకుంటారు. కానీ ఎప్పుడైనా టీ చేశారా టీ పట్టుకొని అమ్మారాఓట్ల కోసమే ఇలాంటి కట్టుకథలు అల్లుతారు. బుల్లెట్ రైలు, వందేభారత్ రైలు అంటూ పచ్చజెండా పట్టుకొని పరుగులు పెడతారు. కానీ, కొత్త రైల్వే ట్రాక్?లు మాత్రం వేయలేకపోయారు. కాంగ్రెస్ హయాంలో జవహర్? లాల్ నెహ్రూ ఎన్నో ప్రాజెక్టులు చేపట్టారు. మీరు ఒకటైనా నిర్మించారా" అని ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**సభ నుంచి ఎందుకు వెళ్లిపోతున్నారు - మహిళలపై నీతీశ్ గరంగరం**

ఖర్గే వ్యాఖ్యలను భాజపా తప్పుపట్టింది. అర్బన్ నక్సల్స్ నుంచి భారత్‌ను మోదీ కాపాడుతున్నారని, అది సహించలేకే కాంగ్రెస్ ఇటువంటి విమర్శలు చేస్తోందని ఆరోపించింది. 'కాంగ్రెస్ అహంకారం ఎప్పటికీ తగ్గదు. రాహుల్ సూచనల మేరకు ఖర్గే దురుసుగా మాట్లాడుతున్నారు. మీరెప్పుడైనా టీ పెట్టారాఅంటూ మోదీని అవమానిస్తున్నారు. మోదీనే కాదు.. గతంలో ఆయన తల్లినీ అవమానించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలే సరైన బుద్ధి చెబుతారు" అని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్? భండారీ పేర్కొన్నారు.

# 'చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్'.. స్టడీ చేస్తున్నాం: మంత్రి నారా లోకేశ్

అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్?ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం" అని లోకేశ్? వెల్లడించారు.

**సీఎం రేవంత్‌తో లోకేశ్ భేటీ**

దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. "రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్?వన్?గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం" అని లోకేశ్? తెలిపారు.

# ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా: జగన్ స్పష్టీకరణ

**ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు**

కూటమి ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని జగన్ ఆరోపించారు. సంక్రాంతి జూదం, గ్రామాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలు, పైనుంచి కింది వరకు కమీషన్ల దందా నడుస్తోందని విమర్శించారు. ఇసుక ధరలు రెట్టింపు అయినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ డబ్బు ఎక్కడికి పోతోందని ప్రశ్నించారు. అమరావతి పనుల్లో తమకు అనుకూలమైన కొద్దిమంది కాంట్రాక్టర్లకే అధిక రేట్లకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వ వ్యతిరేకత గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు, సరైన సమయంలో పాదయాత్ర చేస్తామని జగన్ తెలిపారు. ఏడాది తర్వాత పాదయాత్ర చేపట్టి, మరో ఏడాది పాటు ప్రజల మధ్యే రోడ్లపై ఉంటామని పార్టీ సమావేశంలో చెప్పినట్లు ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 13వ వర్ధంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 13వ వర్ధంతి వేడుకలను అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పరిషత్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినీ చరిత్రలో నవశకానికి నాంది పలికారని అన్నారు. సుమారు 255 సినిమాల్లో నటించి భారత ప్రభుత్వంచే పద్మ విభూషణ్, సినీ రంగంలో ప్రతిష్టాత్మకమైన దాదా ఫాల్కే అవార్డు అందుకున్నారని అన్నారు. తెలుగు సినీ పరిశ్రమలకు ఏఎన్నార్, ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య మాట్లాడుతూ అక్కినేని మీద ఉన్న అభిమానంతో సంస్థను స్థాపించి కొత్త కూరగాయల మార్కెట్ రోడ్ లో విగ్రహాన్ని స్థాపించడం జరిగిందని అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ సివిఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ కి అక్కినేని అవార్డు-2026 ప్రదానం చేస్తున్నామని అన్నారు. సంస్థ గౌరవాధ్యక్షులు సీహెచ్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సినీ రంగంలో ఆయన పోషించిన పాత్రలు అజరామరంగా నిలిచాయని కొనియాడారు. దేవదాసు, ప్రేమనగర్ చిత్రాలలోని పాత్రలు ఆయన మాత్రమే చేయగలిగినవని అన్నారు. ఈకార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు అభిమానులు ఓరుగంటి ప్రసాద్, సింగరాజు శ్రీనివాసరావు, ఉలిచి వేద ప్రకాష్, మురళీకృష్ణ, తన్నీరు నాగరాజు, ఓగిరాల శంకర్, బ్రహ్మారెడ్డి, సత్యనారాయణ, జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ రాజాబాబుకు శుభాకాంక్షలు తెలిపిన ఏపి ఎన్జీఓ సంఘం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 22)




ఏపీఎన్జీవో అసోసియేషన్ మార్కాపురం తాలూకా యూనిట్ అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ బివిఎస్ శాస్త్రి ఆధ్వర్యంలో నూతన మార్కాపురం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ పి రాజబాబును ఏపీఎన్జీఓ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏపీఎన్జీవో అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి జీ రవి కిరణ్, కోశాధికారి రమేష్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ అంజయ్య, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, శ్రీనివాసరావు, నాగ మోహన్, బాల విజయ కుమారి, సంయుక్త కార్యదర్శి భరత్ భూషణ్, లోహిత్ సాయి, నాగార్జున, సరస్వతి, మహిళా వింగ్ చైర్ పర్సన్ సత్యవతి, కన్వీనర్ సుజాత, లక్ష్మి దీపిక, జ్యోతి, ఉద్యోగులు పాల్గొన్నారు.


# ప్రాథమిక స్థాయిలో న్యాయ విజ్ఞానం అందిస్తే సమస్యలకు చట్టపరమైన పరిష్కారం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

న్యాయ విజ్ఞానం అనేది ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థిని, విద్యార్థులకు అందించడం ద్వారా చాలా సమస్యలకు చట్టపరమైన పరిష్కారం దొరుకుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలో గల ప్రభుత్వ ఎస్టి బాలికల వసతి గృహంలో లీగల్ లిటరసీ క్లబ్ ప్రారంభోత్సవ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోని కళాశాలలో వసతి గృహాల్లో ఈ క్లబ్బులు ఏర్పాటు చేయడం జరుగుతుందని వీటి ద్వారా విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన కలిగించి బాల్య వివాహాలకు మరియు మత్తు పానీయాలకు వ్యతిరేకంగా బాల బాలికలపై జరిగే లైంగిక నేరాల వ్యతిరేక చట్టాల గురించి అవగాహన కలుగజేస్తున్నామని ఈ అవకాశాన్ని ఈ క్లబ్లో చేరిన విద్యార్థిని విద్యార్థులు అవగాహన కలిగి ఇతరులకు కూడా అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ జి రవిశంకర్, డిప్యూటీ కౌన్సిల్ పి వీర రాఘవులు, జిల్లా సహాయ గిరిజన అధికారి కట్టా బ్రహ్మయ్య, వార్డెన్ సునీత పాల్గొన్నారు.




ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
23.01.26 శుక్రవారం


# వైవి పర్యటనకు దద్దాల డుమ్మా!

**కనిగిరి వచ్చిన వైవి ని కలవని దద్దాల**

**వైసీపీ నేత డాక్టర్ పెరుగు మురళీకృష్ణ హాస్పిటల్‌కు వైవి వెళ్ళడమే కారణమా?**

**డాక్టర్ పెరుగు మురళిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలంటున్న దద్దాల వర్గం**

**డాక్టర్ పెరుగుకు మద్దతుగా ఉన్న మాజీ పీడీసిసి ఛైర్మన్ పై ఫైర్ అవుతున్న దద్దాల, గుంటక**





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జనవరి 22)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తర్వాత స్థానం రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి. పార్టీలో వైఎస్ కుటుంబంలో అంతా తానై వ్యవహరించే వైవి సుబ్బారెడ్డి గురువారం కనిగిరికి వచ్చారు. వైవి పిఏగా పని చేస్తున్న గుంటుపల్లి పంచాయతీ శంఖరాపురంకు చెందిన దశరధరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైవి కనిగిరి నియోజకవర్గానికి వచ్చారు. గుంటుపల్లిలో పరామర్శ అనంతరం పామూరు మీదుగా కనిగిరి చేరుకున్నారు. పార్టీలో అధినేత తర్వాత అధినేతగా ఉండే వైవి సుబ్బారెడ్డి కనిగిరి నియోజకవర్గ పర్యటనలో వైసిపి కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ కనిపించకపోవడం వైసీపీ వర్గాలతో పాటు మిగతా రాజకీయ పార్టీల్లో సైతం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. వైసీపీ కనిగిరి ఇన్‌ఛార్జి కనిగిరిలో లేకున్నా వైవి కనిగిరి వస్తున్నారంటే ఎక్కడున్న ఆయనతో పాటు కనిగిరిలో పర్యటించాల్సి ఉంది. కానీ కనిగిరిలోనే ఉన్న వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల మర్యాదపూర్వకంగానైనా వైవి ని కలవకపోవడం కనిగిరి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ పీడీసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అంటే పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, జిల్లా జడ్పీటిసిల సంఘం అధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డిలకు అసలు పడడం లేదు. వార్డు, ఊరు లేని వైఎం ప్రసాద్‌రెడ్డి వైసీపీలో పెత్తనమేంటని వారు మండిపడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి డాక్టర్ పెరుగు మురళి వెన్నుపోటు పొడిచారనేది దద్దాల వర్గం ఆరోపణ. అప్పటి నుంచి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల, గుంటకలకు డాక్టర్ పెరుగు మురళి అంటే మండిపడుతున్నారు. డాక్టర్ పెరుగు మురళిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని దద్దాల, గుంటకలు ఈ పాటికే జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. కనిగిరి వైసీపీలో వర్గ రాజకీయాలను ఇంకా పోషిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుర్రా అనుచరుడైన డాక్టర్ పెరుగు మురళి వలన పార్టీకి నష్టమని దద్దాల వర్గం బహిరంగంగానే ఆరోపిస్తుంది. ఈ పరిస్థితుల్లో గురువారం కనిగిరి వచ్చిన రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి డాక్టర్ పెరుగు మురళి నూతన హాస్పిటల్‌కు వెళ్ళడం దద్దాల గుంటకలకు పుండు మీద కారం చల్లినట్లు అయ్యింది. పార్టీలో అసలు జనబలం లేని నాయకుని మాటకు అధిష్టానం విలువిస్తుండడాన్ని ససేమిరా అంగీకరించని దద్దాల, గుంటకలు వైవి సుబ్బారెడ్డి పార్టీ అధినేత జగన్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఉత్తుత్త నాయకులు ఫొటోలకు ఫోజులిస్తే కనిగిరిలో వైసీపీకి నష్టమే కాని లాభం లేదని దద్దాల వర్గం ఆరోపిస్తుంది. వైసీపీ రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి కనిగిరి పర్యటనతో వైసీపీ లోని వర్గపోరు మరింత రాజుకుంది.

## నియోజకవర్గ సమస్యల పై కలెక్టర్‌తో చర్చించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి






**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 22)**

మార్కాపురం నియోజకవర్గ సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. సమస్యల పై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, జెసి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో చేపట్టిన నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 22)**

కలెక్టరేట్లో చేపట్టిన నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఈ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఈ పనుల పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని కలెక్టర్ స్పష్టం చేశారు.

సానుకూల అభిప్రాయమే లక్ష్యంగా.... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. అన్న క్యాంటీన్లు ద్వారా అందుతున్న సేవలు, మహిళలపై నేరాలు, గంజాయి, ఇతర మాదకదవ్యాల కట్టడి, మున్సిపాలిటీల ద్వారా అందుతున్న సేవలు, పారిశుధ్య నిర్వహణ, వివిధ సంక్షేమ హాస్టళ్ళలోని సదుపాయాలపై జిల్లాల వారీగా ఆయన సమీక్షించారు.

ముమ్మరంగా ఏర్పాట్లు... గణతంత్ర దిన వేడుకలు జరిగే ఎస్‌వికెపి కళాశాల మైదానాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో ఇలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా ఆవిర్భావం తర్వాత నిర్వహించే మొదటి వేడుకలు చరిత్రలో నిలిచిపోయేలాగా ఉండాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని కూడా వారు పరిశీలించారు. 26వ తేదీ సాయంత్రం అక్కడ జరిగే తేనీటి విందుకోసం ఏర్పాట్లపైనా వారు చర్చించారు.

## జిల్లా బాల భవిత కేంద్రం ద్వారా చిన్నారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 22)**




జిల్లా బాల భవిత కేంద్రం ద్వారా చిన్నారులకు అంది స్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు ప్రభుత్వ సర్వ జన ఆస్పత్రిలోని జిల్లా బాల భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు పాల్గొని ప్రత్యేక అవసరాలు కలిగిన 25 మంది చిన్నారులకు వీల్ ఛైర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ముందుకు వచ్చి ఒక్కొక్క వీల్ ఛైర్ 12 వేల రూపాయలు విలువ చేసే 25 వీల్ ఛైర్స్ ను ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందచేయడం సంతోషకరమన్నారు. చిన్నారులకు వీల్ ఛైర్స్ అందించిన పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి జోనాధన్ ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జీజీహెచ్‌లోని జిల్లా బాల భవిత కేంద్రం ద్వారా

## సిసిటివి కెమెరాలన్నీ సక్రమంగా పనిచేసేలా చూడండి

**సిఎస్ కె విజయానంద్**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జనవరి 22)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వపరంగా వివిధ ముఖ్య కూడళ్ళు,ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలు తదితర చోట్ల ఏర్పాటు చేసిన 14 వేల సిసిటివి కెమెరాలన్నీ సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అధికారులను ఆదేశించారు. సిసిటివి ప్రాజెక్టు, డాక్యుమెంట్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ అంశాలపై గురువారం ఎపి సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే 14వేలకు పైగా కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో నిఘా నేత్రాల సాయంతో పోలీసులు క్లిష్టమైన నేరాల గుట్టును విప్పుతున్నారు.రాష్ట్రాన్ని పూర్తిగా నిఘా నీడలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈసందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతలను కాపాడేందుకు ముఖ్యంగా నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ ఉల్లంఘనలు తదితరం అందుపు చేసేందుకు సిసిటివి కెమెరాలను రియల్ టైం గవర్నెస్ కేంద్రంతో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని అన్నారు. అంతేగాక రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రతి సోమవారం ఆర్టిజిఎస్ పై సమీక్షిస్తున్నారని అన్నారు. కావున జిల్లాల్లో ఏర్పాటు చేసిన సిసిటివి (తరువాయి 4లో...)




## ఇండియన్ టీ బ్రేక్ నూతన బ్రాంచ్‌ని ప్రారంభించిన కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వినాయక స్వామి టెంపుల్ ఎదురు ఇండియన్ టీ బ్రేక్ నూతన బ్రాంచ్‌ని ఒంగోలు నగరపాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా కమిషనర్‌కి ప్రోప్రైటర్ పిన్నిక కృష్ణ స్వాగతం పలికారు. కమిషనర్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్వాలిటీతో టీ అందిస్తున్నారని ప్లాస్టిక్, పేపర్ కప్స్ వాడకుండా గాజు గ్లాస్ తో టీ అందిస్తున్నందుకు షాపు యాజమాన్యాన్ని అభినందించారు. ఇలాగే దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు, జిల్లాలో ఇండియన్ టీ బ్రేక్ బ్రాంచ్ లను ఏర్పాటు చేసి మంచి పేరు సంపాదించుకుంటున్న కృష్ణ ని అభినందించారు. పిన్నిక కృష్ణ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, కస్టమర్‌లు ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం వెంకటేశ్వర్లు, నాగాలా వెంకటకృష్ణ, చావల సుధీర్, చల్ల హరి, బిల్లా చెన్నయ్య, పెద్దన్న, నాగం వెంగయ్య (చంటి), గణేష్ (టైలర్), తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ధ్యేయం






(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జనవరి 22)

దేశానికి పట్టుకొమ్మల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కోటమే ప్రభుత్వం కృషి చేస్తుందని ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. గురువారం పెద్దారవీడు మండలంలోని తంగాలపల్లి పంచాయతీ తమ్మడపల్లె గ్రామంలో పల్లె పండగ లో భాగంగా 2.0 పలు అభివృద్ధి గోకుల షెడ్లు, త్రాగునీరు ట్యాంకి, బోర్లు,కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం అన్నారు, పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా పాటుపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో జామ్ సుందరం, ఏపిఎం సాంబశివయ్యా ,మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క శ్రీను యాదవ్, మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ యానం వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, సర్పంచి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి,నీటి సంఘం ప్రెసిడెంట్ చిన్న కొండారెడ్డి, మాజీ జెడ్పిటిసి జెడ్డా రవి, వెన్న బోడి రెడ్డి,టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విభిన్న ప్రతిభావంతులకు, గిరిజన ప్రజలకు ప్రత్యేక పిజిఆర్ఎస్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 22)



జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, గిరిజనుల సమస్యలను పరిష్కరించుటకు ప్రతినెలా చివరి శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు ప్రజా సమస్యల పరిస్కార వేది ద్వారా అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక పిజిఆర్ఎస్‌లో విభిన్న ప్రతిభావంతు లు గిరిజనులు తమ సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని, ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లా బాల భవిత కేంద్రం ద్వారా చిన్నారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అంగవైకల్యం ఉన్న చిన్నారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. అంగవైకల్యం అనేది చాలా బాధాకరమని, అంగవైకల్యంతో పుట్టిన పిల్లల భవిష్యత్ ఏమిటి అనే విషయం పై తల్లిదండ్రులు బాధ పడుతుంటారని, అంగవైకల్యంతో పుట్టిన పిల్లలకు చిన్న వయస్సులోనే చికిత్స అందిస్తే మంచి ఫలితాలు ఉంటాయని ఆయన అన్నారు. చికిత్స తర్వాత ఎంతో మంది చిన్నారుల పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. చికిత్స తర్వాత అవసరమైన వారికి వీల్ ఛైర్స్, ఇతర ఉపకరణాలను జిల్లా బాల భవిత కేంద్రం ద్వారా అందిస్తుందన్నారు. నేడు కార్పోరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంచి అనుభవజ్ఞులైన డాక్టర్లు వైద్య సేవలు అందించడం జరుగుచున్నదని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక భారం తగ్గించుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య



ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా బాల భవిత కేంద్రం అధికారి డాక్టర్ భగీరధి దేవి, ఒంగోలు సర్వజన వైద్యశాల పీడియాట్రిక్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్



తిరుపతిరెడ్డి, బాల భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత, పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి జోనాధన్, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఎంఓ డాక్టర్ మాధవి లత, జిజీహెచ్ చెందినా వివిధ విభాగాల వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సిసిటివి కెమెరాలన్నీ సక్రమంగా పనిచేసేలా చూడండి

కెమెరాలన్నీ సక్రమంగా పనిచేసేలా జిల్లా కలక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరించి సిసిటివి కెమెరాలన్నీ పనిచేసేలా చూడాలన్నారు. ఈ వీడియో సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మాట్లాడుతూ వివిధ పట్టణ ప్రాంతాల్లో 123 సిసిటివి కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించామని వాటిని సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అదనంగా మరో 188 కొత్త కూడళ్ళను గుర్తించి అక్కడ సిసిటివి కెమెరాలు ఏర్పాటుకు ఇప్పటికే ఏజెన్సీకి పనులు అప్పగించడం జరిగిందని,జిల్లా కలక్టర్లతో తరచు ఈఅంశంపై సమీక్షిస్తున్నట్టు చెప్పారు.ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలే కాకుండా సిఎస్ఆర్ నిధులతోను,ఇతర విధంగాను ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలను కూడా నియంత్రణలోకి తీసుకుని సక్రమంగా పని చేసేలా చూడాలని కలక్టర్లకు చెప్పారు. ఆర్టీజిఎస్ ఎక్స్ అఫీసియో జాయింట్ సెక్రటరి మల్లికా గర్గ్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 14వేలకు పైగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయగా వాటన్నిటినీ ఆర్టీజిఎస్ తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజు రోజుకూ సీసీ కెమెరాల ప్రాధాన్యత పెరుగుతున్నది. గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అంతేగాక నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరిగింది. దొంగలు, దోషులను పట్టుకోవడంలో మార్గం సుగమం అవుతున్నది. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బంది కరంగా ఉండేది. ఇప్పుడు సీసీటివిలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పడ్డాయి. సీసీ ఫుటేజీల ద్వారా దోషులను గుర్తించి గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నారు. ఇన్విజిబుల్ పోలీసింగ్‌కు సిసిటివిలు ఎంతో దోహదపడుతున్నాయి. ఈ వీడియో సమావేశంలో సిడిఎంఎ జి సంపత్ కుమార్, అదనపు సిఇఓ ఆర్టీజిఎస్, డ్రోన్ కార్పొరేషన్ ఎండి సూర్యమన్ పటేల్ పాల్గొన్నారు. అదే విధంగా వర్చువల్‌గా వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


## కలెక్టరేట్లో చేపట్టిన నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలి






**కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే, ఎరిక్షన్ బాబు**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఆయనతో చర్చించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కూడా కలెక్టర్ ను కలిశారు. స్థానిక అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ నారాయణ, ఎమ్మార్వో చిరంజీవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు కీలక చర్యలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

ఒంగోలు ట్రాఫిక్ నియంత్రణకు సీఏజీఎల్ సంస్థ సీఎస్ఆర్ సహకారంతో గురువారం క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థల ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఒంగోలు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు కీలక చర్య చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు పోలీస్ స్టేషన్‌కు 10 ట్రాఫిక్ బారికేడ్లను సంస్థ ప్రతినిధులు అందజేశారు. రద్దీ ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఇవి ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ అరిఫుల్లా, తిరుపతి డివిజన్ డీఎం జగదీష్, ఏరియా మేనేజర్ శేగు వెంకట గిరిబాబు, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, స్థానిక బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఒంగోలు తాలూకా ఇన్స్పెక్టర్ విజయ కృష్ణ, వి హరిబాబు, పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని సీఏజీఎల్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, సీఏజీఎల్ సంస్థ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలలో 2200కు పైగా బ్రాంచ్‌ల ద్వారా సేవలందిస్తూ, ప్రతి బ్రాంచ్ పరిధిలో పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని సీఎస్ఆర్ ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 108 బ్రాంచ్‌ల పరిధిలో ప్రజలకు ఉపయోగపడే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

## తెలుగు భాషకు గిడుగు కృషి అజరామరం

### ఘనంగా వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు 86 వ వర్ధంతి సభ

### గాదంశెట్టి దంపతులకు గిడుగు పురస్కారం ప్రధానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

తెలుగు భాషా వికాసానికి, గ్రాంథిక భాషను వ్యవహారిక భాషలోకి తీసుకుని రావడానికి ముఖ్య కారకులు గిడుగు వెంకట రామమూర్తి అని, ఆయన వాడుక భాష కోసం చేసిన కృషి అమోఘం, అపూర్వం, అజరామరం అని ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా నాగభైరవ ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నరసం కార్యాలయంలో కళామిత్రమండలి (తెలుగు లోగిలి), నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి 86 వ వర్ధంతి సభ జరిగింది. ఈసభకు నరసం గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వ్యవహారిక భాషలో పాఠ్య పుస్తకాల ప్రచురణ జరగటం కారణంగా ప్రతి సామాన్యుడికి కూడా విద్య సులభతరమైనదని తెలియజేశారు. కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ లిపిలేని సవర భాషకు కూడా రామమూర్తి లిపిని కనుగొన్నారన్నారు. సవర – తెలుగు భాష నిఘంటువును కూడా రామమూర్తి రచించారని పేర్కొన్నారు.నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ ఎవరు ఎన్ని రకాలుగా విమర్శించినా లెక్క చేయక గిడుగు వారు వ్యవహారిక భాష ప్రచారానికి ఎనలేని కృషి చేశారన్నారు..శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, యు.వి.రత్నం, యం.సూర్యకుమారి తదితరులు వక్తలుగా పాల్గొని గిడుగు వారు తెలుగు భాష కోసం చేసిన నిరూపమాన సేవలను కొనియాడుతూ వారి భాషోద్యమం కారణంగానే నేడు సామాన్యులలో కూడా విషయ పరిజ్ఞానం అభివృద్ధి చెందిందని గుర్తు చేసుకున్నారు. ఈ సభకు ముందు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి అందరూ ఘనంగా నివాళులు అర్పించారు . అనంతరం తెలుగు సాహిత్యానికి, విద్యార్థి లోకానికి అపురూపమైన సేవలు అందిస్తూ, సాహితీ సభలలో తమ గొంతుకను వినిపిస్తూ,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లోనూ, ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ పాల్గొంటూ, ప్రకాశం జిల్లాలో ఏ సభలు జరిగినా తెలుగు కవులు, కవయిత్రుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేసి పలువురు ప్రముఖుల మన్ననలను పొంది, విద్యా శతకం “సంకల్పం నీదై “ “వెలుగు రవ్వలు“ ఇంకా కొన్ని నాటికలు, బుర్రకథలు రచించి ,తెలుగు భాష కోసం, తెలుగు భాషా వ్యాప్తి కోసం తమ వంతు సహకారాన్ని అందిస్తున్న తెలుగు పండితులు గాదంశెట్టి శ్రీనివాసులు, సావిత్రి దంపతులకు గిడుగు వెంకట రామమూర్తి పంతులు పేరిట తెలుగు భాషా ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేసి వారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీరం అరుణ, నాళం నరసమ్మ, మిడసల మల్లిఖార్జునరావు, ఓరుగంటి ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ, జి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 22)

విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. బాపట్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం, సమీకృత ఎస్టీ బాలికల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ఎస్సీ సంక్షేమ బాలికల కళాశాల గృహంలో వసతులను అడిగి తెలుసుకున్నారు. 100 మంది విద్యార్థినీలకు గాను, 78 మంది విద్యార్థినీలు ఉండడంపై ఆయన ఆరా తీశారు. వంటగది, మరుగుదొడ్లు, భోజనశాల, ఆర్వో ప్లాంట్, నీటి పైపులైన్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల కొరకు ప్రభుత్వం కేటాయించిన క్రీడా కిట్లు, ఆట వస్తువులన్నింటిపై ఆరా తీశారు. గతేడాది విద్యార్థినీలకు కేటాయించిన ఏకరూపుదుస్తులు, దుప్పట్లు, బెడ్ షీట్లపై సంబంధిత వసతి గృహం సంక్షేమ అధికారిని డి రాహేలును వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భోజనం తయారీకి సిద్ధంగా ఉంచిన బియ్యం, కూరగాయలు, కందిపప్పు, చింతపండు, నిత్యవసర వస్తువుల నాణ్యత, వంట సామగ్రిని ఆయన పరిశీలించారు.





బాలికల సంక్షేమ వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమీకృత ఎస్టీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉండడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. 108 మంది విద్యార్థినీలకు గాను, 60 మంది విద్యార్థినీలే ఉండడం ఏమిటని



ఆరా తీశారు. చిన్నపిల్లలు వసతి పొందే ప్రాంతాన్ని ఇలాగే ఉంచుతారా అని సిబ్బందిని నిలదీశారు. భోజనశాల కిటికీలు తుప్పు పట్టి ఉండడం, వాటిని తెరవకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వాడకుండా నిల్వ ఉంచిన బంకర్ కాట్ లను తుప్పు పట్టి ఉండడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సక్రమంగా పర్యవేక్షణ లేకపోతే విద్యార్థులు ఎలా చదువుకుంటారని నిలదీశారు. మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా, విద్యార్థులకు రుచిగా భోజనం వండి పెడుతున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలకు మంజూరైన కాస్మోటిక్స్, నిత్యవసర సరుకులను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ బాలికల వసతి గృహానికి ప్రహరీ గోడ అవసరమన్నారు. విద్యార్థినీలకు ట్యూటర్ ను నియమించాలని, దోమల మెష్ ఏర్పాటు చేయాలని సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారిని వనిజ కలెక్టర్ ను కోరారు. వసతి గృహ సంక్షేమ అధికారులు విధుల పట్ల నిర్లిప్తంగా ఉండరాదని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేస్తున్న సమాచారాన్ని అందుకున్న ఆర్డిఓ పి గ్లోరియా, ఎస్సీ సంక్షేమ సాధికారత జిల్లా ఇన్చార్జి అధికారి కె సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అబ్బులు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ షాలీమా, హటాహుటినా అక్కడకు చేరుకున్నారు.

# నీట్ యూజి 2026 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాన్ని గుర్తించాలి


## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 22)

నీట్ యూజి 2026 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నీట్ యూజి పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. జాతీయ స్థాయిలో జరిగే నీట్ యూజి పరీక్ష నిర్వహణకు బాపట్ల జిల్లాలో పరీక్షా కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. మే నెలలో జరగనున్న పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రణాళిక రూపొందించాలన్నారు. గత ఏడాది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించామన్నారు. మే నెలలో జరగనున్న పరీక్షకు మూడు కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. సమగ్ర ప్రణాళిక రూపొందించి కేంద్రానికి నివేదిక పంపాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి గంగాధర్ గౌడ్, డీఈవో శ్రీనివాస్, డీఎస్పీ జి రామాంజనేయులు, నీట్ సిటీ కోఆర్డినేటర్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరిలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ వైవీ సుబ్బారెడ్డి పర్యటన





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 22)

వైస్సార్సీపీ నాయకులు, డాక్టర్ పెరుగు మురళీ కృష యాదవ్ కి చెందిన సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ను రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి గురువారం సందర్శించారు. నూతనంగా నిర్మించిన సాయికృష్ణ ఆసుపత్రిలో స్పెషాలిటీస్, సౌకర్యాలు గురించి డాక్టర్ పెరుగు మురళీ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. కరోనా సమయంలో డాక్టర్ పెరుగు మురళి కృష్ణ యాదవ్ కనిగిరి లో చేసిన సేవల గురించి వైవీ సుబ్బారెడ్డికి పలువురు నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైవీ భద్రారెడ్డి, ఒంగోలు వైస్సార్సీపీ ఇంఛార్జి చుండూరి రవిబాబు, మాజీ పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వై ఎం ప్రసాద్రెడ్డి(బన్నీ), రాష్ట్ర కార్యదర్శులు కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, కెవి ప్రసాద్, మాజీ పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ వెంకయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సరితా, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులిశాంతి, మాణిక్యరావు, జడ్పిటిసి కస్తూరిరెడ్డి, గాయం బలరాంమిరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, బొర్రా రెడ్డి, ఓకే రెడ్డి, పాక్ జయ రాములురెడ్డి, నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ నగేష్, న్యాయవాది శ్రీనివాసులరెడ్డి, యాకంటి శ్రీనివాసరెడ్డి, దాసరి మురళి, రామనబోయిన శ్రీనివాసులు, దేవరాజు, శేఖర్, తమ్మినేని సుజాత, సత్యవతి, మహేశ్వరి, షకీలా, సంఘ సుబ్బారెడ్డి, సిద్ధారెడ్డి, మండాది కృష్ణారెడ్డి, సుధాకర్రెడ్డి, నాగూర్ బి, భారతి, నాయబ్ రసూల్, గురు ప్రసాద్, మోహన్రెడ్డి, భవనం కృష్ణారెడ్డి, పులి శీను, గంజి రవీంద్రరెడ్డి, మణికంఠరెడ్డి, కళ్యాణ్, మహేంద్ర, వెంకటేశ్వర్లు, రమేష్రెడ్డి, బొట్టు శీను, నరాల కొండారెడ్డి, మోడీ నారాయణ, గిద్ద తిరుపతయ్య, మేడి బోయిన నారాయణ, కొండయ్య, వెంకట కాశయ్య, తరితదులు పాల్గొన్నారు.

# ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో 'వక్త' గోడ పత్రిక ఆవిష్కరణ

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, తార్కిక ఆలోచన పెంపొదించే విధంగా

## వక్త 2026 రూపొందించిన డీవీఆర్ మూర్తి, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ' వక్త 2026 ' కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలోని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ గోడ పత్రికను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.వి.ఆర్. మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్త వంటి ఉపన్యాస కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్పష్టమైన భావవ్యక్తీకరణ, తార్కిక ఆలోచన, విమర్శనాత్మక దృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలు, ప్రజాజీవితం, సమాజ సేవ రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగగలరని ఆయన పేర్కొన్నారు. ఉపన్యాస కళ విద్యార్థులను సామాజికంగా చైతన్యవంతులుగా, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. వక్త గోడ పత్రిక ద్వారా రాబోయే రోజుల్లో నిర్వహించబోయే వక్త కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, సామాజిక స్పృహ గల వక్తలను తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జన విజ్ఞాన వేదిక నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లా మధు , రాష్ట్ర కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు , జిల్లా అధ్యక్షులు చిగురుపాటి చిన్నాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కెటిసి పాపారాయుడు, రాష్ట్ర సమాచార కార్యదర్శి మీనా, మధు, శరత్, జి.సి.హెచ్. వెంకటేశ్వర్లు,చిట్టెం వెంకటేశ్వరు పాల్గొన్నారు. యూనివర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎమ్మెల్యే కార్యాలయంలో ముందస్తుగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

ఒంగోలులో మంగమూరు రోడ్డులో మర్రిచేట్టు దగ్గర గురువారం సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముందుగా ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కటింగ్ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు రాష్ట్ర నాయకులు,పార్లమెంట్ నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ గణతంత్ర దినోత్సవం రోజున ప్రారంభం

## కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 22)

ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్ ను రెండు రోజుల్లో పూర్తి చేసి, జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల పాఠశాలలు, వైద్యశాలలు, వసతి గృహాలకు అవసరమైన ఫర్నిచర్, కంప్యూటర్లు, ఫ్యాన్లు, దుప్పట్లు, పుస్తకాలు తదితరాలను పెండింగ్ అవసరాలుగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ఈ వేదిక ద్వారా దాతలు, అధికారులు స్వచ్ఛందంగా సహకరించే అవకాశం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతుందన్నారు.బాపట్ల జిల్లాలోని అన్ని శాఖలను అనుసంధానిస్తూ ప్రజలకు అనుకూలంగా వెబ్‌సైట్‌ను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, జిల్లా ఐటీ మేనేజర్ లక్ష్మీవెంకట గోపీనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌తో పాటు, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొబిషన్ అధికారి నరేష్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి శ్రీనివాసరెడ్డి




(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 22)

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉంటేనే తమ భవిష్యత్తు బాగుంటుందని, బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నగంజాం జెడ్పి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణ పై అవగాహన కార్యక్రమం,ర్యాలీ మరియు మనవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్యార్థి వయస్సు నుండే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కడవకుదురులో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటన



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 22)

మండలంలోని కడవకుదురు గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం, ఉప్పు నీటి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలైన ఉప్పు నీటి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ మధువాని, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలైన డాక్టర్ కామాక్షి, డాక్టర్ హరిత హజరై మాట్లాడారు. వరి, మినుము, వేరుశనగ పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా వరి పైరు లో అక్కడక్కడ అగ్గి తెగులు గుర్తించి దిని నివారణకు ట్రైసైక్లోజైల్ 75% మందు లేక కాసుగమైసిన్ 3% మందును పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా మధువాని చౌడు నేలలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు తెలియచేశారు. హరిత మాట్లాడుతూ వరి లో చౌడును తట్టుకునే రకాల గురించి రైతులకు వివరించారు. డాక్టర్ కామాక్షి మాట్లాడుతూ శనగ పైరులో ఎండు తెగులు మరియు వేరుకుళ్ళ తెగులు గురించి పలు సూచనలను రైతులకు తెలియచేశారు.ఇ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## జెవివి నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ




(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 22)

జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్య క్లినిక్ నందు నూతన సంవత్సర డైరీలు మరియు కేలండర్లు ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కంభం మండల శాఖ జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలి. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి అని చెప్పారు. మండల శాఖ అధ్యక్షులు వరికుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలనకు మరియు విద్యాభివృద్ధికి జన విజ్ఞాన వేదిక ఎంతో కృషి చేస్తుంది అన్నారు. ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజం రాతియుగం నుండి రాకెట్ యుగానికి చేరినప్పటికీ ప్రజలలో మూడ విశ్వాసాలు తొలగిపోలేదన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలను సరైన రీతిలో ఉపయోగించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి షేక్ మస్తాన్, ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి నాగేంద్రుడు, కార్యదర్శి ఎస్ తిరుమల నాథ్, అంగన్వాడి టీచర్ భారతి, అంగన్వాడి ఆయా రమాదేవి, కార్యకర్తలు కనుమర్లపూడి షణ్ముఖ సునీల్, పరిటాల రాధాకృష్ణ, షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, ప్రజా భద్రతలే లక్ష్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై చట్టపరమైన చర్యలు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

నేరాల నియంత్రణ, ప్రజా భద్రతలే లక్ష్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు ప్రకాశం జిల్లా పోలీసులు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు నేరాలు నియంత్రణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసు శాఖ క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వలన ప్రజలకు కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, అటువంటి చర్యలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో ఈ కార్యాచరణ కొనసాగించబడింది. గత సంవత్సరం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యల ఫలితంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరిగింది. రహదారులపై, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, పార్కులు వంటి ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడాన్ని అడ్డుకోవడం ద్వారా రోడ్లపై అకతాయిల అల్లర్లు, చిన్న చిన్న ఘర్షణలు, మహిళలు మరియు వృద్ధులకు కలిగే ఇబ్బందులు గణనీయంగా తగ్గుముఖం పడతాయని పోలీసు శాఖ భావిస్తోంది. ప్రజల భద్రతకు భంగం కలిగించే ఏ చర్యనైనా సహించబోమన్నారు. అదే విధంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న ప్రాంతాలను ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు 219 ప్రదేశాలను గుర్తించి వాటిని శుభ్రం చేయడంపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 219 ప్రదేశాలను గుర్తించగా, వాటిలో 169 ప్రదేశాలను ఇప్పటికే శుభ్రం చేయడం జరిగింది. మిగిలిన ప్రదేశాలను కూడా శుభ్రపరిచే కార్యక్రమం కొనసాగుతోంది. దేవాలయాలు పక్కన, పాఠశాలల సమీపంలో, కాలనీల మధ్యలో గుబురుగా పెరిగిన చెట్లు, పొదలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అనుకూలంగా మారుతున్నాయని గుర్తించిన పోలీసులు, స్థానిక ప్రజల సహకారంతో ఆ ప్రాంతాలను శుభ్రం చేయిస్తున్నారు. పోలీసు సిబ్బంది స్వయంగా పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా మార్చడం ద్వారా అక్కడ మళ్లీ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన నేరాలకు అవకాశం తగ్గుతుందని, సమాజంలో మంచి వాతావరణం ఏర్పడుతుంది. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మీ కళ్ల ముందే ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ఇబ్బందులు కలిగిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. అదేవిధంగా, మీ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్ ద్వారా వీడియో రికార్డు చేసి పోలీసు శాఖ వాట్సాప్ నెంబర్ 9121102266 కు పంపవచ్చని, లేదా 112 కు డయల్ చేయవచ్చని తెలియజేస్తున్నారు. ప్రజలు అందించే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు.

# కంభంలో మతిస్థిమితంలేని వ్యక్తి హల్చల్ డ్రోన్ కెమెరా సహాయంతో పట్టుకున్న ఎస్ఐ శివ కృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 22)

బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ప్రకాశం జిల్లా 112 ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌కు సమాచారం అందింది. రాబడిన సమాచారం మేరకు ఒక గుర్తు తెలియని వ్యక్తి కంభం గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక కాలనీలో ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా కర్ర చేతిలో పట్టుకొని స్థానికుల ఇళ్ళ లోకి చొరబడుతూ అడ్డుకున్న వాళ్ళని కర్రతో కొట్టడానికి రావడంతో స్థానికులు భయబ్రాంతులకు గురై 112 నెంబర్ కు కాల్ చేయగా, దానిపై తక్షణమే స్పందించిన కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి తన సిబ్బంది సహాయంతో సంఘటనా స్థలానికి వెళ్లి స్థానిక ప్రజలను ఎటువంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పి, అతని గురించి ఆరా తీస్తుండగా విజయవాడ నుండి ఒక మహిళ ఎస్ఐ శివ కృష్ణారెడ్డి కి ఫోన్ చేసి తన భర్త తిమ్మసర్తి దుర్గాప్రసాద్ వడ్డెర కులం, కంకిపాడు గ్రామం, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నుండి గోవా వెళ్తూ కంభం రైల్వే స్టేషన్‌లో హుబ్లి ట్రైన్‌లో నుండి మతి స్థిమితం కోల్పోయి కిందికి దూకి పారిపోయినట్లు అతని ఆచూకి తెలియడం లేదు సహాయం చేయమని కోరారు. ఆ వ్యక్తే స్థానికులను భయబ్రాంతులకు గురిచేస్తున్నట్లు నిర్ధారించుకొని, అతని పై స్థానికులు దాడి చేయడం గాని, అతను స్థానికులను దాడి చేయడం గాని జరగవచ్చని ఉద్దేశ్యంతో రాత్రి నుండి అతని కోసం కంభం పరిసర ప్రాంతాలతో పాటు డ్రోన్ సహాయంతో కందులాపురం కొండ పై వెతికి గురువారం మధ్యాహ్నం అతడిని పట్టుకున్నారు. వారి కుటుంబ సభ్యులను మార్కాపురం ఇంచార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఇటీవల కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన సూచనల పాటిస్తూ అతనిని వారి కుటుంబ సభ్యలకు అప్పగించారు. తన భర్త ను క్షేమంగా అప్పగించినందుకు ఎస్పీ, కంభం పోలీసులకు బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా అతనిని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందన్నారు. ఇక అతనితో ఎటువంటి ప్రమాదం లేదని స్థానిక ప్రజలు భయాందోళనలు చెందవలసిన అవసరం లేదని ఎస్ఐ శివ కృష్ణారెడ్డి తెలిపారు. సమాచారం అందించిన వెంటనే రాత్రంతా తమతో ఉంటూ వ్యక్తిని పట్టుకున్న ఎస్ఐ ని స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జనవరి 22)

మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా 100, 112, ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఇంకొల్లు సిఐ రమణయ్య అన్నారు. గురువారం ఇంకొల్లు మండలం నాగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు ఇంకొల్లు సీఐ రమణయ్య, ఇంకొల్లు ఎస్ఐ సురేష్, చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ ఏ హరిబాబు ఆద్వర్యంలో విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు సీఐ రమణయ్య శక్తి యాప్ గురించి వివరిస్తూ ఈ యొక్క యాప్ అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, అలాగే ఎవరైనా ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు అరికట్టే విధంగా ఈ యొక్క యాప్ ఉపయోగపడుతుందన్నారు. శక్తి టీమ్ ఎస్ఐ ఏ హరిబాబు మాట్లాడుతూ శక్తి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేస్తూ అలా మనల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే మన తల్లిదండ్రులకు, మీరు చదువుకునే పాఠశాల గురువులకు చెప్పాలని, రోజు రోజుకు పెరుగుతున్నటువంటి సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థులకు సోషల్ మీడియాలో ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ లలో వచ్చే ఫేక్ న్యూస్ లతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఇకార్యక్రమంలో ఇంకొల్లు సీఐ రమణయ్య, ఇంకొల్లు ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ సుబ్బారావు, శక్తి టీమ్ ఎస్ఐ ఏ హరిబాబు, పిసి కే సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# చీమకుర్తిలో ఘనంగా మధురకవి జాన్ మాస్టారు శతజయంతి వేడుకలు




(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి టౌన్, జనవరి 22)

మధుర కవి ,భాషాప్రవీణ మల్లవరపు జాన్ మాస్టారు శత జయంతి ఉత్సవాలు ప్రముఖ వైద్యులు డాక్టర్ బంధ జవహర్ అధ్యక్షతన చీమకుర్తి క్రిస్టియన్ పాలెం నందు, బడి కొష్టం సెంటర్ నందు గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, బాపట్ల వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొదటగా మధురకవి మల్లవరపు జాన్ మాస్టర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. అనంతరం ఉచిత మెగా మెడికల్ క్యాంపు ప్రారంభించారు .క్యాంపులో పలు ప్రాంతాల నుండి వచ్చిన 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంతోమంది పట్టణ,పురప్రజలు హెల్త్ సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై. రామకృష్ణయ్య మరియు ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరి నారాయణ విచ్చేశారు. మరియు విజయ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సిహెచ్ మీనా, డాక్టర్ పాలపర్తి వినోద్ కుమార్, టి.యాని మేరీ ప్రశాంతి, డాక్టర్ సిహెచ్ కార్తీక్ పాల్గొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు జాన్ మాస్టర్ విశిష్టతను ఔన్నత్యాన్ని గూర్చి తెలియజేశారు. కార్యనిర్వాహకులు విజయ హాస్పిటల్ బాపట్ల మేనేజింగ్ డైరెక్టర్ పాలపర్తి మనోజ్ కుమార్ మాట్లాడుతూ మధురకవి జాన్ శత జయంతి వేడుకలు చీమకుర్తి లో ఇంత ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని ,జాన్ మాస్టర్ ఎప్పుడూ సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జాన్ మాస్టారు మిత్రులు జానుడి అధ్యక్షులు వై.విజయకుమార్ , కార్యదర్శి నూకతోటి రవికుమార్ , ప్రధాన కార్యదర్శి ఈర్ల కృష్ణారావు , కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, టి బాబురావు, పట్టణ పుర ప్రముఖులు, అభిమానులు, శిష్యులు, సాహిత్యాభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించిన పిఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి రూరల్, జనవరి 22)

కనిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్ నందు ప్రధానోపాధ్యాయురాలు తులసి పద్మావతి ఆధ్వర్యంలో 21, 22 తేదీలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో మోడల్ స్కూల్‌తో పాటుగా క్లస్టర్ లోని వివిధ పాఠశాలలైన జెడ్పీహెచ్ఎస్ తుమ్మగుంట, ట్రైబల్ వెల్ఫేర్ తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, త్రో బాల్, ఖో-ఖో వంటి వివిధ విభాగాలలో క్రీడలను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించడం జరిగింది.

స్పోర్ట్స్ మీట్ ని ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారులు :

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు సుబ్బారావు, నారాయణరెడ్డి ఇరువురు పాల్గొని క్రీడాకారుల వద్ద గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు తల్లిదండ్రులతో కలిసి యూనిఫామ్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు ఎక్కువ సమయం సెల్ ఫోన్లలో హింసాత్మకమైన రకరకాల ఆటలు ఆడుతూ ప్రాణాలు కూడా తీసుకుంటూ తల్లిదండ్రులకు మనోవేదన మిగలుస్తున్నారన్నారు. అలా కాకుండా విద్యార్థి దశలో క్రీడా మైదానంలో ఆడే ఆటలు మాత్రమే విద్యార్థులకు మనోధైర్యాన్ని, ఐక్యమత్యాన్ని, శారీరక




దృఢత్వాన్ని అందిస్తాయని తెలియజేసి విద్యార్థులను చైతన్యపరిచారు.

**క్రీడా జ్యోతిని వెలిగించిన జాతీయ క్రీడాకారుడు కాశీ విశ్వనాధరెడ్డి**

కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ క్రీడాకారుడు కాశీ విశ్వనాధరెడ్డి జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలైన మోడల్ స్కూల్ క్రీడాకారుల వద్ద టార్చిని అందుకొని జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల్లో రాణించిన విద్యార్థులు జీవితంలో ఎన్నో విజయవకాశాలు అందుకుంటారని తెలిపారు.

**తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పందిటి మోహన్ కి అభినందన**

ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ తరపున పాల్గొన్న పందిటి మోహన్ విద్యార్థుల్లో దాగివున్న వివిధ శక్తులను వెలికి తీయడానికి ఈ క్రీడలు ఎంతో ఉపయోగకరమని, మోడల్ స్కూల్ వారు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ వేడుక విజయవంతంగా సాగాలని తల్లిదండ్రుల కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడాకారులను సత్కరించిన ప్రధానోపాధ్యాయురాలు

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసి పద్మావతి గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలతో పాటుగా ఛాంపియన్ ట్రోఫీ ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి క్రీడా విభాగం లోనూ చాలా చురుకుగా పోటీ తత్వంతో ఆడారని అదే సమయంలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం తో పాటుగా ఇతర పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రెండు రోజులపాటు సాగిన కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ వి వి రమణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పి జాన్, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జి రాంజీ స్కీమ్‌ను రద్దు చేయాలి

(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జనవరి 22)



మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని, ఆ చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి అన్వేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోనితీ సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2005లో మహాత్మా గాంధీ పేరుతో తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసి, దాని స్థానంలో జి రాంజీ పేరుతో నూతన చట్టాన్ని తీసుకురావడం వల్ల కోట్లాది గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధికి హామీ ఇచ్చే కీలక అంశాన్ని తొలగించడం ద్వారా పేదల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలైన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్రం సాధ్యమయ్యాయని, భూస్వామ్య వర్గాలతో బేరమాడే శక్తి పేదలకు లభించిందన్నారు. లక్షలాది ఎకరాల్లో పేదల భూములు అభివృద్ధి చెందాయని, కరోనా సమయంలో దేశవ్యాప్తంగా కోట్లాది మందికి ఉపాధి కల్పించి అన్నం పెట్టిన చట్టం ఇదేనని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా వేలాది మందికి ఈ చట్టం ద్వారా ఉపాధి లభించిందన్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా, కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ అంశాన్ని, 90:10 నిధుల వాటాను రద్దు చేసి రాష్ట్రాలపై భారం మోపుతోందని విమర్శించారు. అలాగే 73, 74 పంచాయతీ రాజ్ చట్టాలకు విరుద్ధంగా స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా చేసి, పని హక్కును హరించే విధంగా జి. రాంజీ చట్టాన్ని తీసుకురావడం తీవ్ర అన్యాయమన్నారు. 2005 మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేసి, ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో కనీసం రూ. 2.5 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

ఒంగోలులోని మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం 46 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజురైనా రూ.24,22,913ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల నాయకులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండల అధ్యక్షులు ఉప్పు గుండూరి నాగేశ్వరరావు, మండల టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మందపల్లి శ్రీనివాసరావు, మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ రాఘవ, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## భీమవరం జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మండల తహసీల్దార్ టి శ్రీనివాసులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 22)

ఉలవపాడు మండలం భీమవరం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల తహసిల్దార్ టి. శ్రీనివాసులు ప్రత్యేక అధికారిగా ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ పరిసర ప్రాంతాలను, వంటశాలను, క్లాస్ రూములను పరిశీలించి విద్యార్థులను చదువు మరియు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, వీఆర్వో పేరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## పబ్లిక్ సర్వెంట్స్ సహకార గృహ నిర్మాణ సంఘాన్ని బలోపేతం చేయండి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 22)

మార్కాపురంలో ఉన్న మార్కాపురం పబ్లిక్ సర్వెంట్ సహకార గృహ నిర్మాణ సంఘంను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రత్యేక అధికారి, జూనియర్ ఇన్స్పెక్టర్ రమాదేవి అన్నారు. మార్కాపురం నెహ్రూబజారులోని మార్కాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కాపురం పట్టణ శివారులోని సుందరయ్యకాలనీకి సమీపంలో 1982లో సహకార గృహ నిర్మాణ సంఘం ద్వారా ప్రభుత్వం ఉద్యోగులకు భూమిని కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్పు చేసి విక్రయం చేసిందన్నారు. అప్పట్లో 134 మందికి 400 గజాల చొప్పునా ప్లాట్లు కేటాయించినట్లు చెప్పారు. సంఘంలో 260 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. సంఘంలోని ప్లాట్ ఉన్న వారు అందరూ సంప్రదించాలని ఆమె కోరారు. అంతే కాకుండా సంఘాన్ని భలోపేతం చేయడానికి సభ్యులు అందరూ సహకరించాలని కోరారు. సభ్యులు వచ్చేటప్పుడు భూమి పత్రాలు, రశీదులు తీసుకోని రావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఆర్డీ రామకృష్ణరావుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అన్నా



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జనవరి 22)

హైదరాబాద్ నానకరమ్ గుడా స్టార్ హాస్పిటల్ నందు గిద్దలూరు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్డీ రామకృష్ణరావు ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం చేరారు. డాక్టర్‌లు బైపాస్ సర్జరీ చేయగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు గురువారం ఆర్డీ రామకృష్ణరావుని స్టార్ హాస్పిటల్ నందు పరామర్శించి డాక్టర్లు సూచించిన సూచనలు, సలహాలు పాటించాలని కోరారు.

### పొన్నలూరు మండల తహసీల్దార్, ఎస్ఐలను కలిసిన జనసేన పార్టీ నాయకులు





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 22)

పొన్నలూరు మండల తహశీల్దార్ పుల్లారావు, ఎస్ఐ సత్యనారాయణ లను గురువారం కొండపి నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త కనపర్తి మనోజ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మండల జనసేన పార్టీ నాయకులు కర్ణ తిరుమలరెడ్డి, షేక్ ఖాజావలి, యలమందల మాల్యాద్రి, పత్తిపాటి మాధవరావు, నల్లపు బ్రహ్మయ్య, ఎనిమిరెడ్డి మాల్యాద్రి, గోగన చిన్నబాబు, నూకల లక్ష్మీనారాయణ, రెడ్డెం లక్ష్మణ్‌రెడ్డి, దానయ్య, మిడసల అనిల్, మండల జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నూతన ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 22)

ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు నందు గురువారం ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డిపార్ట్మెంట్ ఏజెన్సీ వారు నూతనంగా ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం నందు నూతన ఆధార్ నమోదు కేంద్రంను నగరపాలక సంస్థ కమీషనర్ కె వెంకటేశ్వర రావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ముందుగా ఆధార్ కార్డు లేని గిరిజనులకు కొత్త ఆధార్ కార్డులు నమోదు చేయబడును. ఆధార్‌కు సంబంధించి అన్ని సేవలు అనగా కొత్త ఆధార్ కార్డులు, బాల ఆధార్, ఫోన్ నెంబరు అప్డేట్, పేరు మార్పులు, చిరునామా, పుట్టిన తేదీల మార్చబడుతుందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఐటీడీఏ వారి తరుపున పాద్యమి సొల్యూషన్స్ మేనేజర్ యస్ మహేష్, టెక్నికల్ టీమ్ మెంబెర్స్ రాకేష్, ఆసిఫ్, ఆపరేటర్ కె కళ్యాణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలే టిడిపి బాట
# టీడీపీ పార్టీ కాదు..ప్రజా ఉద్యమమే
# తెలుగు ప్రజల ఆశయాలే టిడిపి పునాది

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జనవరి 22)

పేదల సంక్షేమం, తెలుగు జాతి గౌరవం కోసం ఎన్టీఆర్ చూపిన బాటలోనే టిడిపి ముందుకు సాగుతోందని, ఆయన ఆశయాలే తెలుగుదేశం పార్టీకి మార్గదర్శకమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆశయాల సాధనకే పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. విలువలు, శ్రామికుల కృషి, సామాన్యుడి ఆకాంక్షలను ప్రతిబింబించే ప్రజా ఉద్యమమే టిడిపి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం, భావజాలం, చరిత్రపై విస్తృతంగా వివరించారు. పసుపు జెండా శుభంసంపదలకు ప్రతీక అని, పార్టీ గుర్తులైన గుడిసె, నాగలి, చక్రం రైతుశ్రామికుల కృషిని సూచిస్తాయని, సైకిల్ సామాన్యుడి పురోగతికి, ఆశయ సాధనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని కేవలం రాజకీయ పార్టీగా కాకుండా తెలుగు ఆత్మగౌరవ ఉద్యమంగా ప్రారంభించారని గుర్తు చేశారు. అప్పటివరకు ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైన రాజకీయాల్లో అట్టడుగు వర్గాలు, వృత్తి నిపుణులు, విద్యావేత్తలకు నాయకత్వ అవకాశాలు కల్పించింది టిడిపేనని స్పష్టం చేశారు. జీఎంసీ బాలయోగి, కింజరపు ఎర్రన్నాయుడు వంటి నాయకులతో పాటు కెసిఆర్, రేవంత్ రెడ్డి వంటి అనేక మంది నాయకులు టిడిపి వేదికపైనే ఎదిగి తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని ఏలూరి తెలిపారు. 1982లో ఎన్టీఆర్ చేపట్టిన చైతన్య రథయాత్ర తెలుగు రాష్ట్ర రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ సిద్ధాంతం కూలీలు, రైతులు, మహిళలు, వెనుకబడిన వర్గాల ఆశయాలను కేంద్రంగా చేసుకున్న ప్రజా తాత్వికతగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ అభివృద్ధితో పాటు జాతీయ బాధ్యతను సమన్వయం చేసే పార్టీగా టిడిపి ప్రత్యేక గుర్తింపును సాధించిందని ఏలూరి పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు దారి చూపే నాయకత్వాన్ని అందించడంలో టిడిపి ముందుందని, సమాజ సేవకు అంకితభావంతో పనిచేసే కేడర్ పార్టీకి ప్రధాన బలమని అన్నారు. ప్రభుత్వంపై వైసిపి దుష్ప్రచారాన్ని ఖండిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ శిక్షణా శిబిరంలో పార్టీ నేతలు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

### అధినేత చంద్రబాబుపై నమ్మకంతో ప్రజల మద్దతు
### టీడీపీ భావజాల శిక్షణలో ఎమ్మెల్యే ఏలూరి



### ఘనంగా పప్పుల వీధిలో గండికోట శివ జన్మదిన వేడుకలు




(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 22)

బద్వేల్ పట్టణంలో పప్పుల వీధిలో ఫ్రెండ్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో గండికోట శివ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఫ్రెండ్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను గండికోట శివ శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలిపారు. అనంతరం కేక్ తినిపించి, స్ప్రేలతో, టపాసులతో, ఘనంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్, హర్ష, కొలిశెట్టి పవన్ కుమార్, రవి, యాదాల అజయ్ కుమార్, సుశాంత్, మానస్, రోహిత్, మల్లీ, సాయి, దస్తగిరి, రమేష్, రామ్ తేజ్, బబ్లు, చరణ్, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం తో పాటు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



### కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న వరికుంట్ల అనిల్ దంపతులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 22)



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, సురేఖ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శివమణితో కలిసి వారు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అనిల్ మాట్లాడుతూ శ్రీవారి కృపతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. మ్యూజిక్ డైరెక్టర్ శివమణితో కలిసి స్వామివారి ఆశీస్సులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. మార్కాపురం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో వర్ధిల్లాలని వేడుకున్నారు. ఆలయ పండితులు అనిల్ దంపతులకు వేద ఆశీర్వచనాలు అందించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# పాదయాత్ర కాదు..
# 11 మంది ఎమ్మెల్యేలకు ఓదార్పు యాత్ర చేసుకో జగన్

### సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దావోస్ పర్యటన విజయవంతం
### చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 22)






సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు దావోస్ యాత్ర విజయవంతమైందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. ముస్లిం విద్యార్థినిలకు స్కాలర్షి పంపిణీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక సమస్యలు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. ప్రపంచంలోనే దిగ్గజ సంస్థలను ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడుతున్న చంద్రబాబు నాయుడు కృషిని ప్రజలు మరువలేరన్నారు. ప్రపంచవ్యాప్తంగా విదేశీ పెట్టుబడిలో 25% ఏపీలో పెట్టేందుకు ముందుకు వస్తున్నారని, 26 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయని తద్వారా 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకత్వంలో లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్ర యువతకి మంచి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని వివరించారు. మూడేళ్లు కళ్ళు మూసుకోండి అధికారం మనదే అంటున్న జగన్ అసత్య ప్రచారాలు మానుకోవాలని నీవు ఇక 30 ఏళ్లు కళ్ళు మూసుకోవాల్సిందేనని చీఫ్ విప్ జీవి ఎద్దేవా చేశారు. అధికార కోసం పాట కలలు కంటూ జగన్మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం చేపడుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేస్తూ ప్రజల ఆదరణ చూసి జగనకు మతిభ్రమించి నేను చివరిలో పాదయాత్ర చేస్తానని అనడం హాస్యాస్పదమన్నారు. నీవు పాదయాత్ర కాదు, మీ 11 మంది ఎమ్మెల్యేల వద్ద పరామర్శ యాత్ర చేసుకోవటమేనని వ్యాఖ్యానించారు. ఒక్క అవకాశం అని ప్రజలు అధికారం ఇస్తే జగన్మోహన్ రెడ్డి జే టాక్స్ తో రాష్ట్రాన్ని లూటీ చేశారని విమర్శించారు. జే టాక్స్ తో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రాలకు పారిపోవాల్సిన పరిస్థితి నాడు నెలకొందన్నారు. ప్రజా సమస్యలు పట్టకుండా అసెంబ్లీకి రాకుండా వైసిపి ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి సమస్యలపై ప్రస్తావించాలని హితవు పలికారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల నుండి రాష్ట్రంలో విదేశీ పెట్టుబడుల కోసం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు చేస్తున్న కృషిని ప్రజల మరువలేర న్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం కోటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తుందన్నారు. డీఎస్సీ ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి ని రాష్ట్ర యువత చీ కొడుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేయటం కాదని, ఐదేళ్లపాటు చేసిన అరాచకాలు దుర్మార్గాలకు జగన్ ప్రజల వద్దకు క్షమాపణ యాత్ర చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# వైభవంగా శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం 21వ వార్షికోత్సవం వేడుకలు

## రెండు రోజుల పాటు కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు


(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 22)

బద్వేల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలిసిన శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం 21,వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 23,తేది శుక్రవారం నుండి శనివారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని సబ్ జైల్ సూపర్డెంట్ శ్రీహరి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పద్మావతి మెడికల్ స్టోర్ దర్శి సుబ్బరాజా,వూరిబిశీడి మనోహర్ రెడ్డి, అశోక్ రెడ్డి, బిరం రవి శంకర్ రెడ్డి, వడ్లపూడి నాగభూషణం తోపాటు పలువురు కమిటీ సభ్యులు తెలిపారు,ఈ సందర్భంగా గురువారం సాయంత్రం వార్త విలేకరితో పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ బద్వేల్ పట్టణం పోలీస్ స్టేషన్ సబ్ జైల్ ఆవరణంలో వెలిసిన శ్రీ శ్రీ కనకదుర్గమ్మ దేవి ఆలయం 21,వ వార్షికకోత్సవ వేడుకలను శ్రీ విశ్వాస నామ సంవత్సర మాఘ శుక్ల పంచమి శుక్రవారం నుండి శనివారం వరకు రెండు రోజులు పాటు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు, మొదటిరోజు శుక్రవారం సాయంత్రం 4:30 నుండి బద్వేల్ టౌన్ నెల్లూరు రోడ్ అయ్యప్ప దేవస్థానం నుండి 108 కలిశాలతో శోభాయాత్రను నిర్వహించడం జరుగుతుందన్నారు, అలాగే శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ తదుపరి శ్రీ దుర్గా మాతకు 108 కలశాలతో 9 నదుల జ్వాలాలతో పంచామృతాలతో బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక అభిషేకం ఉదయం 6, గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం 9 గంటల నుండి చండీ హోమం, మహా మంగళహారతి ఆశీర్వచనం కలదు అన్నారు, అనంతరం సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రీతికరమైన 21 రకాల పుష్పాలతో అత్యంత వైభవంగా వివిధ రకాల ప్రత్యేక పుష్పాలతో పుష్పయాగం కార్యక్రమాన్ని కనుల పండగగా నిర్వహించడం జరుగుతుందన్నారు, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు, కావున పట్టణ పరిసర ప్రాంత భక్తాదులందరూ విరివిరిగా అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పలువురికి ఆహ్వానం పలికారు. ఉత్సవాలుకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు పలువురికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి : శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం 21,వ వార్షికోత్సవ వేడుకల్లో భక్తాదులందరూ విరివిరిగా పాల్గొని కనకదుర్గమ్మ అమ్మవారి ప్రత్యేక హోమాలు అభిషేకాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలను కనుల పండగగా నిర్వహించడం జరుగుతుంది, కావున భక్తాదులందరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని జరగబోయే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మనవి చేయడమైనది.

# ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానంతో సమానం

### రక్తదానం చేసిన యువకుడిని అభినందించిన డాక్టర్ కోటా సుమన్



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 22)

ప్రతిరోజు అనుకోకుండా తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూ ప్రమాదాల్లో రక్తం పోయి ప్రాణాలు పోయిన సంఘటన కూడా మనం చూస్తూనే ఉన్నాం. ఇటీవల బద్వేల్ ప్రాంతంలో బ్లడ్ డోనర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఎవరికి ఏ గ్రూప్ రక్తం అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే ఆ మెసేజ్ ను గ్రూప్ ద్వారా తెలియచేసి సకాలంలో అనేకమందికి రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూపును పలువురు డాక్టర్స్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురువారం సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ఓ వ్యక్తి కి ఆపరేషన్ కి ఏ నెగిటివ్ రక్తం అత్యవసరం కాగా విషయం తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యులు మైలపల్లి సుబ్రహ్మణ్యం ద్వారా సకాలంలో అతనికి రక్తదానం చేయడం వలన వారి ఆపరేషన్ సుఖవంతంగా జరిగింది. సకాలంలో రక్తదానం చేసిన మైలపల్లి సుబ్రహ్మణ్యంను సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కోటా సుమన్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వై వి సరస్వతి, పలువురు డాక్టర్స్ ఆ యువకుడిని అభినందించారు. ప్రతిరోజు అనుకోకుండా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు రీత్యా అలాగే గర్భిణీ మహిళకు రక్తం అత్యవసరమైనప్పుడు బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యులు తక్షణమే స్పందించి సకాలంలో అవసరమైన రక్తదానం చేయడం వలన అనేకమంది ప్రాణాలను కాపాడిన వారవుతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో ఎవరికైనా రక్తం అవసరమైనప్పుడు ప్రజలందరూ కూడా ముందుకు వచ్చి సకాలంలో రక్తదానం చేయాలని వారు పలువురికి కోరారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ గ్రూప్ అడ్మిన్ వల్లంకొండు రాఘవేంద్ర, హాస్పిటల్ సిబ్బంది సుబ్బరాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా శివశక్తి సేవలు చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

### ముస్లిం మైనారిటీ విద్యార్థినీలకు స్కాలర్షిప్లు పంపిణీ చేసిన చీఫ్ విప్ జీవీ, ఎమ్మెల్యే నజీర్





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 22)

రాజకీయాలకతీతంగా తాము శివశక్తి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు తెలిపారు. యువ నేత,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు జన్మదిన సందర్భంగా శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వినుకొండ పట్టణంలోని షాదీ ఖానాలో ముస్లిం పేద విద్యార్థినిలకు స్కాలర్షిప్ ల పంపిణీ కార్యక్రమం చేపట్టగా ముఖ్యఅతిథిగా చీఫ్ విప్ జీవి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పాల్గొని స్కాలర్షిప్లు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడుతూ శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ 1998లో పేద విద్యార్థులకు స్కాలర్షిప్ల పంపిణీ తోనే ప్రారంభించడం జరిగిందన్నారు. 26 ఏళ్లగా ఫౌండేషన్ నుండి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముస్లిం విద్యార్థినీలకు ఫౌండేషన్ నుండి స్కాలర్షిప్లు అందజేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. శివశక్తి ఫౌండేషన్ ఉపకార వేతనాలు అందుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు డాక్టర్లు, ఇంజనీర్లు, అనేక ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్నారని వివరించారు. మీరందరూ విద్యలో ఉన్నత ప్రతిభను కనబరిచి ఉన్నత స్థాయిలో స్థిరపడి పేదలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వినుకొండ ముస్లిం సోదరులు రాజకీయాల్లో తనకెంతో సహాయ సహకారాలు అందించారని వారికి రుణపడి ఉన్నానని తెలిపారు. వినుకొండ పట్టణానికి శాశ్వత త్రాగునీటి పథకం చేపడతానని, 210 కోట్లు నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న స్కాలర్షిప్ లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నజీర్ అహ్మద్ మాట్లాడుతూ 26 ఏళ్లగా శివశక్తి ఫౌండేషన్ ద్వారా జీవీ ఆంజనేయులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఈ ప్రాంత ప్రజలు మరువలేరన్నారు. ముస్లిం విద్యార్థినీలకు ఫౌండేషన్ నుండి స్కాలర్షిప్లు అందించడం అభినందనీయమన్నారు. నారా లోకేష్ బాబు జన్మదిన సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎన్‌టిఏ సభ్యత్వ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, గోపవరం, జనవరి 22)

గోపవరం మండలంలో నేషనల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఏ) సభ్యత్వ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మానుగుంట రవిశంకర్, మండల అధ్యక్షులు దగ్గుబాటి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి కూరాకు రవి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలు బీవీ ఆర్ నగర్, వల్లెరవారి పల్లె మోడల్ స్కూల్స్, మహమ్మద్ కాలనీ, కోటిరెడ్డి నగర్తో పాటు ప్రాథమిక పాఠశాలలు సాయి నగర్, మడకలవారిపల్లె, వల్లెరవారి పల్లె మడకలవారిపల్లె, రామాపురం, ఆరోగ్యపురం తదితర పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆ శాఖ క్యాలెండర్లు, స్టిక్కర్లు, డైరీలను అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు చూపిన ఆతిథ్యానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మండలంలోని ఉపాధ్యాయులు కార్యక్రమాలను ప్రశంసిస్తూ, సంఘ బలోపేతానికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించిన మండల ఉపాధ్యాయులకు ఎన్‌టిఏ పక్షాన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# రైతు ముమ్మడిరెడ్డి నారాయణరెడ్డి మృతి

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 22)



విజయ ఇన్ఫ్రా యం.యస్.ఆర్ టిప్పర్స్ యజమాని ముమ్మడి రెడ్డి నాగేంద్రరెడ్డి తండ్రి ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి (75) గురువారం సాయంత్రం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి కి భార్య అనసూయమ్మ కుమారుడు నాగేంద్ర రెడ్డి, కుమార్తె వల్లూరు సుజాత ఉన్నారు. నారాయణరెడ్డికి గత 8 నెలల క్రితం ఇంటి వద్ద నుండి పొలం కు వెళుతూ ద్విచక్ర వాహనం తగిలి కిందపడి వెన్నెముక పూర్తిస్థాయిలో చెడిపోయింది. అప్పటినుండి హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఉన్నారు, ఈ ప్రమాదంలో నారాయణరెడ్డి మంచానికే పరిమితమయ్యారు. పలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చివరిగా వారి స్వగ్రామమైన ఓబులాపురంలో ఆయన తుదిశ్వాస వదిలినట్టు వారి భార్య అనసూయమ్మ, కుమారుడు ఉమ్మడి రెడ్డి నాగేంద్రారెడ్డి, కుమార్తె సుజాత కుటుంబ సభ్యులు తెలిపారు. బద్వేల్ నియోజకవర్గంలో ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి రైతు అనేకమందితో మంచితనంగా ఉంటూ అందరితో కలిసి మెలిసి ప్రేమ అపాధిగా అందరిని పలకరిస్తూ ఉండేవారు. ఒక్కసారిగా ఆయన మృతి చెందిన విషయం తెలియగానే పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. నాగేంద్రరెడ్డి అందరికీ సుపరిచితులు కాబట్టి వారి తండ్రి మరణం విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, ఆయా శాఖల అధికారులు, పలువురు రైతులు మృతి చెందిన నారాయణరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శుక్రవారం కాశీనాయన మండలం ఓబులాపురంలో మధ్యాహ్నం 1 గంటకు అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

# అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, జనవరి 22)

మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధవటం రోడ్ సిఎస్ఐ చర్చి సమీపంలో వున్న ఓ ఇంటిలోకి కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. సుమిత్రానగర్ వైపు నుంచి వచ్చిన కారు ప్రహరీ గేటును బద్దలు కొట్టుకుంటూ లోపలికి ప్రవేశించింది. ఈ ఘటన ప్రమాదవశాత్తు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. జరిగిన ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.